క్లుప్తంగా

నీటి వనరులున్న పొలాల్లో చెరకు పనులు



పెదంకలాంలో చెరకు విత్తనం నాటుతున్న రైతులు

సీతానగరం: మండలంలో నీటివనరులున్న గ్రామాల్లో రైతులు మట్టి సమూనా పనులు పూర్తి చేసుకుని చెరకు విత్తనం నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రబీవరి వరిపంట కూడిక పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో నీటి వనరులను సమకూర్చుకున్న పెదంకలాం, వెంకటాపురం, పణుకుపేట, అనంతరాయుడుపేట, బూర్జ, చెల్లన్నాయుడువలస, తామరఖండి గ్రామాల రైతులు బోదెలు తీసిన మళ్లలో చెరకు విత్తనాలు నాటుతున్నారు. ఇప్పటికే మండలంలోని 800 ఎకరాల విస్తీర్ణంలో చెరకు ప్లాంటేషన్ జరిగినట్లు వ్యవసాయాధికారి అవినాష్ ధ్రువీకరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురం టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలగనుందని ఏఈ రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని నర్సిపురం, తాళ్లబురిడి సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. నర్సిపురం, సంగంవలస, హెచ్ కారాడవలస, వెంకంపేట, ఎమ్మార్‌నగరం, పుట్టూరు, రావికోన, చినబొండపల్లి, పెదమరికి, చినమరికి, డీకేపట్నం, తాళ్లబురిడి, గోచెక్క, డోకిశీల, లచ్చిరాజుపేట, బందలుప్పి, పెదబొండపల్లి, జమదాల, లక్ష్మీనారాయణపురం, పట్టణంలోని వైకేఎం కాలనీలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి



పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం పంచాయతీ కార్యదర్శి మర్రి రాజశేఖర్ గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు యథావిధిగా తన విధులు నిర్వర్తించుకుని ద్విచక్రవాహనంపై రామభద్రపురంలోని తన ఇంటికి చేరుకుని ఇంట్లో కుర్చీలో కూర్చుని ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఏడేళ్ల కొడుకు ఉన్నారు.

నీరు విడుదల

పాలకొండ: వేసవి నేపథ్యంలో తోటపల్లి రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా నీటిపారుదల శాఖ అధికారులు బుధవారం నీరు విడుదల చేశారు. ప్రస్తుతం తోటపల్లి ఎడమ కాలువ ద్వారా శివారు ప్రాంతంలోని చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఇదే సమయంలో వర్షాలు కూడా కురవడంతో ఈ ఏడాది ముందుగానే చెరువులకు జలకళ సంతరించుకుంది.

ఏపీఆర్‌జేసీకి ఎంపిక

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన మేరంగి సందీప్‌కుమార్ ఏపీఆర్‌జేసీకి ఎంపికయ్యాడు. ఇటీవల గత నెలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 100కు 87 మార్కులు సాధించి సత్తా చాటాడు. సందీప్‌కు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో విద్యార్థి చదువుకు స్థానిక ఆంగ్ల ఉపాధ్యాయుడు నర్సింహ చౌదరి ఆర్థికంగా సాయం చేస్తున్నాడు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో గ్రామపెద్దలు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామంలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బుధవారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు మెమొంటో అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను గత మూడేళ్లగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో చిన్న వయస్సులోనే చార్టెడ్ అక్కౌంటెంట్‌గా ఎంపికైన వినోద్‌కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గేదెల నరసింహ, వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోషల్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మూడడ్ల చంద్రశేఖర్ అందించిన సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

అందరి చూపు.. పార్వతీపురం వైపు

- ఇక్కడ గెలిచే అభ్యర్థి పార్టీదే రాష్ట్రంలో అధికారం
- సుదీర్ఘ కాలంగా ఆనవాయితీ
- పోలింగ్ వైఎస్సార్‌సీపీకి అనుకూలమంటున్న పరిశీలకులు



పార్వతీపురం నియోజకవర్గం మ్యాప్

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానిది ఒక్కో ప్రత్యేకత. కొందరు నాయకులు గెలిచినా వారి పార్టీలు ఓడిపోవడం, కొందరు అభ్యర్థులు ఓడిపోయినా..వారి పార్టీ అధికారంలో రావడం చూస్తుంటాం. కానీ పార్వతీపురం నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఏ పార్టీ అభ్యర్థి అయితే ఇక్కడ గెలుపొందుతాడో. ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే సంప్రదాయం కొనసాగుతోంది. 2024లో కూడా ఈ సెంటిమెంట్ ఏ పార్టీదో అన్నది ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవు తోంది.

అలజంగి వైపే గెలుపు పవనాలు

పోలింగ్ సరళిని బట్టి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు, ఎంపీ అభ్యర్థి తనూజారాణి విజయానికి అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయన్న అంచనాకు రాజకీయ పరిశీలకులు వచ్చారు. గత ఎన్నికల తరహాలోనే ఈ సెంటిమెంట్ దక్కే పరిస్థితులున్నాయని పోలింగ్ సరళిని బట్టి రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. మహిళల ఓటింగ్ భారీగా పెరగడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం గాలి వీచినట్లు చెబుతూ మెజార్టీపై చర్చించుకుంటున్నారు.

20 ఏళ్లుగా నియోజకవర్గం పరిశీలన ఇలా..

గడిచిన 20 ఏళ్లుగా నియోజకవర్గాన్ని పరిశీలిస్తే పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పార్టీ అధికారంలోకి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నియోజకవర్గం అభ్యర్థి గెలుపు వ్యవహారాలు ఆసక్తి కలిగిస్తాయి. 2004 నుంచి గెలిచిన అభ్యర్థికి సంబంధించిన పార్టీ అధికారం చేపడుతూ వస్తోంది. దాదాపు 20 ఏళ్లుగా ఇక్కడ అభ్యర్థి గెలవడం, ఆ పార్టీ అధికారంలోకి రావడం చూసి జనం సంప్రదాయంగా భావిస్తున్నారు.

2004 నుంచి గెలుపు వివరాలు ఇలా..

2004లో కాంగ్రెస్ తరఫున శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ తరఫున డి.జగదీశ్వరి పోటీచేయగా 1796ఓట్ల మెజార్టీతో శత్రుచర్ల విజయరామరాజు గెలుపొందారు. అప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చింది.

- 2009లో కాంగ్రెస్ తరఫున సవరపు జయమణి, టీడీపీ తరఫున బొబ్బిలి చిరంజీవులు బరిలో నిలవగా 2718 ఓట్లతో సవరపు జయమణి గెలుపొందారు. అప్పుడు కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.
- 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున జమ్మాన ప్రసన్నకుమార్, టీడీపీ తరఫున బొబ్బిలి చిరంజీవులు పోటీచేశారు. 6929 ఓట్ల మెజార్టీతో బొబ్బిలి చిరంజీవులు గెలుపొందగా 2014లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలో వచ్చింది.
- 2019లో వైఎస్సార్‌సీపీ తరఫున అలజంగి జోగారావు, టీడీపీ తరఫున బొబ్బిలి చిరంజీవులు బరిలో నిలిచారు. 24,199ఓట్ల భారీ మెజార్టీతో అలజంగి జోగారావు గెలుపొందారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు టీకాలు తప్పనిసరి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.నారాయణ

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.నారాయణ

పార్వతీపురంటౌన్:

షెడ్యూల్ ప్రకారం అర్హులైన చిన్నారులకు టీకాలు తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.నారాయణ అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని బాలగుడబ గ్రామంలో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణులకు, గడువు తేదీలోగా వేయాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో టీకాలు వేయాలని, వ్యాక్సిన్ పరిమితి చూసి వేయాలని కోరారు. గ్రామంలో పిల్లల టీకా పూర్తయిన వెంటనే రికార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు సమయానికి టీకా వేయించాలని, సరైన పోషకాహారం అందించాలని, ఎండలో పిల్లలను తిరగనివ్వరాదని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు జయ గౌడ్, నాగమ్మ, ఏఎన్‌ఎం రామలక్ష్మి, సీహెచ్‌ఓ జగదీష్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయావకాశాలపై ఊహాగానాలు

సీతానగరం: సాధారణ ఎన్నికలు ముగియడం, ఈవీఎంలలో ఓట్లు నిక్షిప్తం కావడంతో విజయావకాశాలపై రాజకీయ పార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నాయకుల ఊహాగానాలు వెల్లువెత్తున్నాయి. ఈ మేరకు సీతానగరం మండలంలోని గ్రామాల్లో బుధవారం ఎక్కడ చూసినా రెండు పార్టీల నాయకులు పెన్, కాగితాలు చేతపట్టుకుని నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి? ఎన్ని పోలయ్యాయి? అందులో మహిళలు ఎంత శాతం ఓట్లు వేశారు. అధిక సంఖ్యలో మహిళలు అధికార పార్టీకి ఓట్లు వేసే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. అలాగే బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో ఏమేరకు ఓట్లు పోలయ్యాయో గణాంకాలు వేసుకుంటున్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలో ఓటర్లు ఎక్కువగా ఎటు మొగ్గు చూపారనే లెక్కలు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో వైఎస్సార్‌సీపీకి మెజారిటీ ఉంటుందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది. జూన్ 4 వరకూ ఇదేతంతు గ్రామాల్లో కనిపిస్తుందని పలువురు చెబుతున్నారు.

ఎరువులు అందించేందుకు చర్యలు

పాలకొండ: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు అందించేందుకు వ్యవసాయ శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా ఇండెంట్ సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆ శాఖ ఎ.డి రత్నకుమారి తెలిపారు. జూన్ నెలలో విత్తనాలు వేసే సమయంలోనే ఎరువులు కూడా అందిస్తామని తెలిపారు.

మిగిలిన పనులపై దృష్టి

వీరఘట్టం: నెల రోజులుగా అలుపెరగకుండా ఎలక్షన్ విధులు నిర్వహించిన వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది ఇక నుంచి మిగిలిన పనులపై దృష్టి సారించాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలలన్నారు. అలాగే భూ సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో డీటీ సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో గ్రామపెద్దలు


జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామంలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బుధవారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు మెమొంటో అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను గత మూడేళ్లగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో చిన్న వయస్సులోనే చార్టెడ్ అక్కౌంటెంట్‌గా ఎంపికైన వినోద్‌కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గేదెల నరసింహ, వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోషల్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మూడడ్ల చంద్రశేఖర్ అందించిన సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

రోడ్డు మీదే ధాన్యం రాశులు..

భామిని: మండలంలో రబీ వరి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు ఉండడంతో ట్రాక్టర్లు కూడా దిగలేని పరిస్థితి. దీంతో పొలాల్లో హార్వెస్టర్లతో కోసి ధాన్యాన్ని సమీపంలోని ఏబీ రోడ్డుపైనే కుప్పలుగా పోస్తున్నారు. రోడ్డుకిరువైపులా ధాన్యం బస్తాలు వేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయి.

సాలూరులో పాంచ్ పటాకా?

- రాజన్నదొర 5వ సారి ఎమ్మెల్యేగా విజయం
- ధీమా వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- మెజారిటీపైనే చర్చ



సాలూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కడైనా అభ్యర్థుల గెలుపోటములపై చర్చ జరగడం సాధారణం. అయితే సాలూరులో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర గెలుపుపై కాకుండా ఆయనకు వచ్చే మెజారిటీ పైనే వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు చర్చించుకుంటున్నారు. మండలాలపై ఆశలు లేకపోయినా, సాలూరు మున్సిపాలిటీలో టీడీపీకి భారీ మెజారిటీ వస్తుందని భావించిన ఆ పార్టీ నాయకులకు శృంగభంగం తప్పదని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. సాలూరు మున్సిపాలిటీలో 41,709 ఓట్లు కాగా 28,693 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో సాలూరు మున్సిపాలిటీపై టీడీపీ అతిగా ఆశలు పెట్టుకోవాల్సిన అవసరం లేనట్లు స్పష్టంగా అర్థమవుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు.

నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రచారం

వైఎస్సార్‌సీపీ నాయకులను రాజన్నదొర తనదైన శైలిలో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు.ఓ వైపు తన వర్గాన్ని బలపర్చుకుంటూనే, ప్రతిపక్షాల బలహీనతలను గుర్తించి చాణక్య తంత్రాన్ని ప్రదర్శించారని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో దిట్టగా పేరొందిన రాజన్నదొర..పార్టీ నాయకు లతో పాటు పలు వర్గాల ప్రజలను ప్రసన్నం చేసుకోవడంలో రాజన్నదొర కొట్టిన పిండి కావడం మరోసానుకూలాంశంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో సుమారు రూ.1300 కోట్ల అభివృద్ధి, 1600 కోట్లకు పైగా సంక్షేమ పథకాలు అందించామని తాము చేసిన మంచిని వివరిస్తూ, తన ప్రచార అస్త్రంగా రాజన్నదొర దూసుకు పోయారు. ఇదే క్రమంలో టీడీపీని నమ్మరాదని, 2014లో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, 2024లో మళ్లీ టీడీపీ కూటమి ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టో ఇచ్చిందంటూ టీడీపీని రాజన్నదొర ఎండగట్టడంలో విజయం సాధించినట్లు కనిపిస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని సంధ్యారాణి కోరిన క్రమంలో గత టీడీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ ఎమ్మెల్సీగా పనిచేసిన సంధ్యారాణి నియోజకవర్గానికి చేసిందేమీ లేదంటూ రాజన్నదొర ప్రజాక్షేత్రంలో గట్టిగా ఎండగట్టడంలో సఫలీకృతులయ్యారని పలువురు నాయకులు మాట్లాడుకుంటున్నారు. రాజన్నదొర 5వ సారి ఎమ్మెల్యేగా విజయదుందుభి మోగించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చర్చించుకుంటూ రాజన్నదొర మెజారిటీపైనే మాట్లాడుకోవడం కనిపిస్తోంది.

మున్సిపాలిటీ, మండలాల వారీగా ఓటింగ్ వివరాలు

మండలం పేరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
సాలూరు మున్సిపాలిటీ	41,709	28,693
సాలూరు మండలం	44,727	35,132
మక్కువ మండలం	42,257	32,238
పాచిపెంట మండలం	37,116	29,017
మెంటాడ మండలం	38,680	31,251
మొత్తం	2,04,489	1,56,331

వేతనదారులు జాగ్రత్తలు పాటించాలి



అంటిపేటలో పనులను పరిశీలిస్తున్న ఏపీఓ భాను

సీతానగరం: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులు సమయపాలన పాటించి, నిర్దేశించిన పనులు చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ భాను కోరారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట, కాశీపేట, చినభోగిలి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం 13234 మంది వేతన దారులు ఉపాధి పనుల్లో పాల్గొన్నారని తెలియజేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వడదెబ్బకు గురికాకుండా ఉండాలన్న జాగ్రత్తలపై టెక్నికల్ సహాయకుల ద్వారా మేట్‌లకు అవగాహన కల్పించామన్నారు. అలాగే వేతనదారులు తీసుకువెళ్తున్న తాగునీరు చల్లని నీడనిచ్చే చెట్లకింద, మట్టితో తీసిన గోతుల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. పనులు చేసిన చోట వేతనదారులు ఏర్పాటు చేసుకున్న టెంట్‌లు, గుడారాలను అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాలని కోరారు. ఎండ బారిన పడకుండా ఉండేందుకు వేతనదారులు సమయ పాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాల వరకూ 144 సెక్షన్



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రజానీకానికి ఎస్సై ఎం.రాజేష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ గ్రామాల్లో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. జూన్ 4న ఓట్ల కౌంటింగ్ జరగనున్నందున అంతవరకూ మండలంలోని 35 పంచాయతీలకు సంబంధించిన 62 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో గట్టి బందోబస్తీ మధ్య సీజ్ చేసి భద్రపరిచినట్లు చెప్పారు. జూన్ 4 వరకూ గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో రాజకీయపార్టీల కార్యకర్తలు, అభిమానులు ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

గ్రామల్లో గొడవలు జరగకుండా చర్యలు

పార్వతీపురంటౌన్: గ్రామల్లో ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టామని పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ప్రశాంతంగా ప్రజలందరూ ఓటు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు వరకు గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లుగాని చేయకుండా..ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

గిరిశిఖర గ్రామాల్లో దోమల మందు పిచికారీ

- పరిశీలించిన డీఎంఓ



పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: గిరిశిఖర గ్రామాలైన అగారు, గోచెక్క గ్రామాల్లో బుధవారం నిర్వహించిన దోమల మందు పిచికారీని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పరిశీలించారు. మే15 నుంచి జిల్లాలో ప్రారంభమైన మొదటి దశ దోమల మందు స్ప్రేయింగ్ పరిశీలనలో భాగంగా ఆయన గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ దోమల మందు సక్రమంగా పిచికారీ చేస్తున్నదీ, లేనిదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దోమల సంహారిణి ఏసీఎం5% రసాయనం కలిపే మోతాదు, స్ప్రే చేసిన గదులు మొదలైన వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. స్ప్రేయింగ్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. స్ప్రే జరిగిన ఇళ్లకు ఆరోగ్య శాఖ నిర్దేశించిన విధంగా వేసిన మార్కింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఓ అక్కడి ప్రజలకు స్ప్రేయింగ్ ఆవశ్యకతను వివరిస్తూ దోమతెరల వినియోగంపై అవగాహన కలిగించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. మలేరియా అదుపులో ఉంచేందుకు స్ప్రేయింగ్ దోహదపడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు



వెంకంపేటలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని వెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 72 మంది రోగులకు బుధవారం వైద్య సేవలు అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీసీ విధానంలో ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్యసేవలు అందిస్తున్నామని, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండడం వల్ల ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్దే వైద్యసేవలు అందించినట్లు తెలిపారు.

గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్యసేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణా మందు పిచాకారీ చేస్తున్న సిబ్బంది

సీతంపేట:

మండలంలోని పలు గ్రామాల్లో దోమల నివారణ మందు (ఏసీఎం 5 శాతం) బుధవారం పిచికారీ చేశారు. కోసంగి, బుడ్డడుగూడ, వంబరెల్లి, సంకిలిగూడ గ్రామాల్లో గిరిజనుల ఇళ్లలో పిచికారీ చేసి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మలేరియా నివారణ సబ్ యూనిట్ ఆఫీసర్ జె. మోహనరావు మాట్లాడుతూ.. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ప్రతి కుటుంబం తమ ఇంటిలో దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.